మా మరదలు

వేదుల సత్యనారాయణశాస్త్రిగారు (సాహితీసమితి)

ఏదో పురాణములో ఒక పతివ్రతకథ చదివాను. కుష్ఠరోగపీడితుడైన తన భర్తను బుజముమీద ఎక్కించుకొని ఆమె ఆయన కోరినవేశ్యయింటికి మోసుకొని వెళ్లినదని, ఆయనకోరిక ఈడేర్చడముకోసము ఆవేశ్యకు సేవకూడా చేసినదని చదివినప్పుడు నాశరీరము పులకరించిపోయినది. ఆ సతీమణి చరిత్రను మృదుమధురమైన భాషలో వ్రాసిన ఆకవి కృతార్థు డనుకొన్నాను. ఇంకా ఎందరో గొప్పగొప్పకవులు పతివ్రతల మహిమను పద్యకావ్యములుగా, నాటకాలుగా, నవలలుగా వ్రాసినారు. తన సతీసోదరిచరిత్ర వ్రాస్తున్నానని ప్రతికవికూడా గర్వపడిఉంటాడు. ఎందుకంటే సర్వధర్మములూ నాశనమైనా ఈదేశమున హిమాచలముకన్న ఉన్నతముగా, స్థిరముగా నిలిచిఉన్నది పతివ్రతామహిమ. సతీమతల్లుల నిట్టూర్పులతో ఈ దేశమందలి గాలి యశస్సౌరభములను ప్రపంచమందంతటా వెదజల్లుతున్నది.

ఇవి స్త్రీస్వాతంత్ర్యపురోజులు. పురాణకాలపునాటి పతివ్రతల చరిత్రలకు, నేటి స్వాతంత్ర్యవాదులు, ఆకథలు అసలు అబద్ధములనీ, స్త్రీదౌర్బల్యమనీ, స్త్రీత్వమునకు అవమానమనీ, ఇంకా ఎన్నోవిధాల వ్యాఖ్యానములు చేస్తున్నారు. ఈస్థితి సావిత్రీ చంద్రమతులు మొదలైన ఆదర్శకసతులకథలకు కూడా తప్పలేదు. పూర్వకాలములో సతులకు ఈ దేశమున ఎట్టిస్వాతంత్ర్యము ఉండేదో వీరు యోచించరు. ఇప్పుడు కావలసిన స్వాతంత్ర్యమేమో వీరికి తెలియదు. అందువల్లనే అనాలోచితములూ విరుద్ధములూ అయిన ఈవాద ప్రతివాదములు.

ఏవిషయములోనూ పురాణములలోని సతీమతల్లులకు తీసిపోని ఒక పతివ్రతకథనే నేను ఇప్పుడు వ్రాయదలచుకొన్నాను. ఇది నాస్వకపోల కల్పితము కాదు. వాస్తవమునకు ప్రతిరూపము. నేను ఏసతినిగూర్చి వ్రాయబోతున్నానో ఆమె పౌరాణిక సతీమతల్లులవలె చిరస్మరణీయ; తేజస్విని. ఆత్మత్యాగమందు, పాతివ్రత్యమందు, సహిష్ణుతయందు ఆమె పౌరాణిక సతీమణుల సంతానమని అనిపించుకొన్నది. అందువల్లనే ఆమె అక్షరరూపముగా ఉండదగ్గదని నాకు తోచినది.

ఆమె నాచిన్న ఆడుపడుచు. ఆమెపేరు దేవి. నేను వ్యక్తురాలనై మా అత్తవారింట అడుగుపెట్టినప్పుడే నాకు దేవితో ప్రథమపరిచయము. అప్పటి కామెకు పదేండ్లు.

నా మామగారు గొప్పడాక్టరు. ఆచుట్టుపట్ల ఆయనకున్నంతపలుకుబడి ఎవరికీ లేదు. ఆయనకు ముగ్గురు కొడుకులు ముగ్గురు కూతుళ్లు. అందులో మావారు పెద్దవారు.

మా దేవి కడగొట్టుది. మావారు ప్లీడరీ చేస్తున్నారు. నెలకు అయిదారు వందలు సంపాదిస్తున్నారు. దేవికి ఇంకా పెండ్లి లేదు.

ఆయింట్లో దేవితోనే నాకు ఎక్కువ స్నేహము. ఆమె రాత్రింబగళ్లూ ముద్దుగా నావెంట వెంట తిరుగుతుండేది. ఆమె చేష్టలూ, ఆమెనవ్వులూ, ఆమె ముద్దుమాటలూ మరచిపోదామన్నా మరిచిపోలేను. అమాయిక స్నేహముతో, స్వార్థరహితమైన ప్రేమతో, నిష్కపటమైన మమకారముతో మా దేవి నన్నూ నాహృదయమునూ నిలువునా వికసింపచేసేది. నేను కొంచెముసేపు మాట్లాడకుండా ఊరుకుంటే నాదగ్గరికి వచ్చి వేలు ఊపుతూ తల ఆడిస్తూ "ఆఁ, వదినా! అమ్మకోసమూ, నాన్నకోసమూ అప్పుడే బెంగపెట్టుకున్నావూ?" అని నవ్వుతూ అడిగేది. 'లే'దని నేను ఎంత చెప్పినా ఒప్పుకొనేది కాదు. గబగబ గదిలోకి వెళ్లి ఒక బొమ్మను తీసుకొనివచ్చి నాచేతికిచ్చి "ఇదుగో నాబిడ్డను నీకు ఇచ్చేస్తున్నాను. నీకు ఇటువంటి కొడుకే పుడతాడు. రేపే నీవు మీవాళ్ల ఇంటికి వెళ్లుదువుగాని, నాన్నతో అమ్మతో, అన్నయ్యతో నేను చెప్పతాను. దిగులుపడకు. నాకూతురిని నీకు ఎందుకిచ్చానో ఎరుగుదువా? నేనుకూడా నీవెంట వస్తాను. సరేనా? ఏం? వదినా?" అని ఏమేమో అనేది.

దేవి నిజముగా దేవివంటిదే. తన కలుపుగోలు తనముతో నా హృదయములో తనకు కావలసినంత చోటు చేసుకొన్నదామె. నాకు చెల్లెళ్లు లేరు. దేవి నాకు దొరికిన తర్వాత ఆలోటు మరి నాకు కనబడనేలేదు. నాకు చెల్లెలున్నా దేవిలాగు నా హృదయమును వశపఱచుకొనేదో లేదో చెప్పలేను.

నా మామగారు చండశాసనులు. స్త్రీలను కట్టుబాటులలో ఉంచడమంటే ఆయనకు ఎంత పక్షపాతమో స్త్రీస్వాతంత్ర్యమంటే అంతకన్నా ఎక్కువ విరోధము ఆయన ఇంగ్లీషు చదువుకొనినవాడు కాడు. అయినా స్త్రీలు ఇల్లాండ్రై ఉండడమే మంచిదని ఇటలీ మునులోనీ లాగే ఆయనకూ ఉద్దేశ్యము. ఆయన తనకూతుళ్లను ఎవరినీ స్కూలుకు పంపలేదు. ఒక ముసలిపండితుడు ఇంటికే వచ్చేవాడు. అతనిదగ్గరనే పిల్లలకందరికీ విద్యాభ్యాసము. మా దేవికూడా ఆయన దగ్గరనే ఇంట్లోనే చదువుకొన్నది. చదవడమూ వ్రాయడమూ ఆమెకు బాగా వచ్చును. అచ్చమాంబగారు వ్రాసిన అబలా సచ్చరిత్ర రత్నమాల ఎప్పుడూ చదువుతూ ఉండేది.

పన్నెండోయేట మా దేవికి వివాహమయినది. వరునిపేరు ఉమాపతి. ఆయన బి. ఏ. ప్యాసయినాడు. వాళ్లు అంత ఆస్తిపరులు కారు. ఏదో సంసారిపక్షము. ఈ సంబంధము తన చెల్లెలికి తగినది కాదని మావారు మనసులో చాలా విచారపడ్డారు. నా మామగారు మాత్రము నవ్వుతూ "బి. యల్. చదివింతాము. ప్యాసయినతర్వాత నీకు జూనియరుగా తీసుకొందువు. గాని" అని అన్నారు.

ఏలాగో దేవి వివాహము జరిగిపోయింది. మాఅత్తగారు అల్లుణ్ణిచూచి రహస్యముగా "మాబిడ్డ చందమామలాటిది. అల్లుడు మాత్రము అంత రూపసికాడు." అని అన్నది. నా అభిప్రాయముకూడా సరిగా ఆలాగే ఉన్నది. నా మనస్సులోకూడా విచారము లేకపోలేదు. పైకి ఎందుకు అనడము !! "ఏమో! దేవికికూడా ఈ సంబంధము అంత సంతృప్తికరముగా లేదేమో?" అని నా మనసులో అనుకొనేదానను. ఎందుకంటే ఉమాపతి అంత రూపురేఖలు కలవాడు కాడుగదా!

దేవి అత్తవారింటికివెళ్లి ఒక నెలరోజులు ఉండి తిరిగివచ్చినది. దేవికి "మొగుడంటే చాల ఇష్టమే" అని మేము అప్పుడు అనుకొన్నాము. ఒకసారి నేను ఏకాంతముగా ఉన్నపుడు "నీమొగుడు నీకు తగినవాడేనే? నీకు ఇష్టమేనా?" అని అడిగినాను. ఆమె నవ్వి నా బుజముపట్టుకొని నొక్కుతూ, "పోలే నీవంతానూ? ఆడువాళ్లకు మొగుడికంటె ఇష్టు లెవరుంటారు?" అన్నది. నేను ఆమె రెండు బుగ్గలూపట్టుకొని నొక్కుతూ "అప్పుడే మొగుడంటే నీకు ఇంత అభిమానమేమిటే! ఈ మమకారము మాకు ఇదంతా"—అని ఏమో అనబోతున్నాను. దేవి నానోరు మూసింది. నేను వెనుకకు తిరిగిచూచాను. అప్పుడే అత్తగారు దేవుడిఇంట్లోకి వెళ్లుతున్నది.

బహుశా ఆమె మామాటలు విని ఉంటుంది. అణచుకొంటూఉన్న ముసిముసి నవ్వు ఆమెముఖముమీద నాకు కనుపించింది. మా అందరిమనస్సులలో నల్లమబ్బులాగు ఆవరించిఉన్న సందేహము ఇప్పుడు విడిపోయింది. పుట్టింటికివచ్చి ఎన్నాళ్లో కాకముందేనవ్వుతూ దేవి మరల అత్తవారింటికి వెళ్లిపోయింది.

ఒక సంవత్సరము అయినది. ఒకనాడు మావారు నాతో "ఉమాపతి పరీక్షపోయింది. ఇక చదవడట ఏదైనా వ్యాపారము చేస్తానని చెప్పినాడు. అందుకోసము అయిదువేల రూపాయలు ప్రస్తుతము కావలెనట. ఆమొత్తము తండ్రినిఅడిగితే ఆయన చాలాకోపపడి "మింగ మెతుకులేదు మీసాలకుసంపెంగనూనె" అని ఇంట్లోఖర్చుకే నానాకష్టాలు అవుతుంటే నీకు అయిదువేలుఎక్కడ దండుకొనివస్తాను ఇప్పుడు ? నీకు ఇష్టమయితే ఇంత తిని ఇంట్లో పడిఉండు లేకుంటే పో" అని కసరి చీవాట్లు పెట్టి తిట్టినాడట ఆరూపాయలు నేను ఇద్దామనుకొంటున్నాను. ఏదోవిధముగా అతడు నాలుగుడబ్బులు సంపాదించుకొంటుంటే ఏ ఇబ్బందీ ఉండదు. అయిన సంసారము కానప్పుడు అన్నీకష్టాలే. దేవికేమైనా సుఖపడేగీత ఉన్నదేమోననే నాప్రయత్నము. అందుకే ఆడబ్బు ఇచ్చిచూతాము. ఆస్తీపాస్తీలేదు. తండ్రి కాకులకు ఎంగిలిచేయికూడా విసరని బాపతు. ఏమిచేస్తాము మరి?" అన్నారు.

నేను ఆమాటవిని మావారితో "సరే. దేవిసుఖముకోసము మీరేమిచేసినా నాకు ఇష్టమే. డబ్బుఇవ్వండి. కాని మీనాన్నగారితో కూడా కొంచము చెప్పి ఇస్తేమంచిది. లేకుంటే ఆడబ్బు తగలబడిపోతే—"

నామాట ఇంకా పూర్తి కాకమునుపే మావారు నవ్వుతూ "ఏబ్బే, ఉమాపతి ఇంకో మోస్తరు మనిషి కాడు. మీ ఆడవాళ్ల ఆలోచనలు ఎప్పుడూ ఇలాగే ఉంటవి. ఏమయినా కానీ డబ్బు ఇవ్వడము తప్పదు." అన్నారు. నేనేమీ మాట్లాడలేదు.

నాలుగురోజు లయిన తర్వాత ఉమాపతి వచ్చి రెండుమూడురోజు లున్నాడను కొంటాను. ఆడబ్బు తీసుకొని వెళ్లిపోయినాడు. కొన్నాళ్లు అయినది. మా మామగారు ఒకరోజున మావారితో "ఉమాపతి బియ్యపు వర్తకము ఆరంభించాడట! అతనికి డబ్బు ఎక్కడిదో?" అని అన్నారు. మావారు జబాబివ్వలేదు. "అతనికి నీవేమైనా ఇచ్చావా?" అన్నారు మరల మామగారు. "ఊఁ. చాలా నిర్బంధపెట్టాడు. పోనీ వ్యాపారముచేసి నాలుగుడబ్బులు వెనుకవేస్తే మనపిల్ల సుఖపడుతుందని—"

మాట ఇంకా ముగియకమునుపే మా మామగారు ముఖము చిట్లించి చాలా తెలివితక్కువపని చేశావు. వాడు వట్టి దౌర్భాగ్యుడు. చివరకు మనపిల్లను గంగలో దింపుతాడు." అని చిరాకు పడుతూ వెళ్లిపోయినారు.

కొన్నినెలలు గడిచిపోయినవి. తొలిచూలు పురుడు పోసుకోవడమునకు దేవిపుట్టింటికి వచ్చినది. ఆమె ఒంటిని ఒకనగకూడా లేదు. నల్లపూసలూ మంగళసూత్రమూ మాత్రము మిగిలి ఉన్నవి. అది చూచి మా అత్తగారు "నీ నగలన్నీ ఏమయినవే? చేతిగాజులు కూడా—" అని ఏమో అనబోయినది.

దేవి చాలా విరక్తితో "నగలున్నవి. అవి అమ్ముకొని తినేవాళ్లుకారు వాళ్లు. ఒకవేళ అమ్ముకొన్నా అవి వాళ్లసొమ్ము. ఏమిచేసుకొంటే మనము ఏమనగలము?" అని అన్నది.

మా అత్తగారు ముక్కుమీద వేలువేసుకొన్నది. ఆశ్చర్యపడుతూ దేవి ముఖముకేసి చూచినది. దేవి ముఖము కోపమువల్ల ఎఱ్ఱపడినది. మాఅత్తగారు చాలా మనసునొచ్చుకొంటూ "ఎంతకోపము వచ్చిందే? అడగడమే తప్పా? వాళ్ల ఇంట పడ్డావని మేమంత పరాయివాళ్లమై పోయినామటే తల్లీ?" అని అన్నది.

"ఆడుబిడ్డ పరాయిఇంటిది కావడము కొత్తకాదు. కాని అంతా తెలిసి పేదవాళ్లకిచ్చివేసినతర్వాత చీటికిమాటికి ఇటువంటి మాటలలో వాళ్లను అవమానపరచడము అంత మంచిదికాదని చెప్పుతున్నాను." అని దేవి గంభీరముగా తల్లికి జబాబుచెప్పి గబగబ మేడమెట్లెక్కి పైకివెళ్లిపోయినది. నిశ్చేష్టురాలైపోయి మా అత్తగారు ఉన్నచోటనే నిలుచుండిపోయినది. నేను మాత్రము నెమ్మదిగా మేడమీదికివెళ్లి దేవిని నా గదిలోకి పిలిచి నెమ్మదిగా "మొగుడిపక్షము వహించి కన్నతల్లితో దెబ్బలాడడానికి నీకు సిగ్గులేదే, నీ సిగ్గుచిముడ! మొగుడంటే ఒకేసారే పడి

చచ్చిపోతున్నావేమిటి? సిగ్గుమాలినదానా?" అన్నాను.

దేవి "కాదు వదినా? నేను చూస్తున్నాను కదూ! అమ్మకుగాదు, నాన్నకు కాదు, ఎవరికీ ఆయనంటే గిట్టదు. ఆయనమీద ఇష్టము లేదు. 'మేము పేద వాళ్లము గనుక ఎన్ని తలవంపులైనా భరించితీరాలి' అని ఆయన ఎంతో దుఃఖపడుతుంటారు." అని అన్నది.

"ఎలాగైనా ఉమాపతి నిన్ను అమాంతముగా బుట్టలో వేసుకొన్నాడే. లేకుంటే ఇంత మమకారమూ ఇంత అభిమానమూ మేము ఎన్నడూ ఎరగమమ్మా!" అని నేను అన్నాను.

దేవి నవ్వుతూ "పోవే నీమాటలూనూ, నీవూను!" అని అన్నది. తర్వాత ఒకసారి నేను ఆమాటా ఈమాటా చెప్పుతూ రహస్యముగా 'నగలమాట ఏమిటే?" అని దేవిని అడిగినాను.

"ఎవరితో చెప్పవుగదా?" అన్నది దేవి.

"నాసంగతి నీకు తెలియదా ఏమిటి?" అన్నాను నేను.

దేవి తలవంచుకొని "వ్యాపారము చేయడమునకు మీ అన్నయ్యకు కావాలంటే ఇచ్చాను" అన్నది.

"నగలు అన్నీనా?"

ఆఁ. అవన్నీ అమ్మితే నాలుగు వేలపైచిల్లర వచ్చినది.

"మరి మీఅన్నయ్య కొంతడబ్బు ఇచ్చాడే వ్యాపారమునిమిత్తమై మీ ఆయనకు?"

"ఆడబ్బు వ్యాపారములో నష్టమై పోయింది వదినా?"

"అయిదు వేలూనా?"

"ఆఁ. ఆయన చెప్పారు. చూడు ఈమాట మాఅన్నయ్యతో గాని చెపితే నన్ను చంపుకోతిన్నట్టే తెలిసిందా?"

"చెప్పను. ఎవరితో చెప్పను. కాని నీవు చాలా తెలివిమాలినపని చేశావు దేవీ? ఆడబ్బు వ్యాపారములో పోయిన దని నేను నమ్మను. ఇంకేదో విధముగా—"

నామాట కడ్డువచ్చి దేవి "లేదువదినా? ఆయన మహో మోస్తరు మనిషి కాడు. ఆయనకు ఏ కళంకమూ లేదు. అదిగాక నన్ను ఎంత ప్రేమతో ఆదరిస్తున్నాడో నీవు ఊహించలేవు." అన్నది.

నాకు నవ్వువచ్చింది. నవ్వుతూ "నీవంటి తెలివితక్కువ దద్దమ్మను ప్రేమిస్తున్నట్లు నటించడము అంతకష్టమైన పనిగాదు." అన్నాను. దేవి వేళాకోళపు నవ్వునవ్వింది. ఆనవ్వులో ఆమెకు నామాటలమీద ఎంత అవిశ్వాసము ఉన్నదో నాకు తెలియకపోలేదు. ఆమె నవ్వుతూ తల ఊపుతూ "వదినా? పోదు! నీమాటలూ నీవూనూ? నీతో ఏమాటా చెప్పగూడ దనుకొంటాను. మరి చెప్ప

కుండా ఒక్కనిమిషమైనా ఉండలేను. అంత తెలివితక్కువకు నేనేమిచ్చినప్పుడు సిప్పిల్లనుకొన్నావా? రేపో మాపో పిల్లతల్లిని కాబోతున్నాను. తెలిసినదా! సరేగాని నీవు కొంచెము సేపు ఇక్కడనే కూర్చొనిఉండు. అమ్మకు నామాటలకు కోపము వచ్చినట్లున్నది. నేను కిందకివెళ్లి ఆమెను శాంతపరచి వస్తాను." అని దేవి కిందికి వెళ్లినది.

దేవి చెప్పినమాటలు నేను మావారితో చెప్పడమా? మానడమా? నేను ఆమె దగ్గర ఒట్టుపెట్టుకొన్నాను. కాని ఆఒట్టుమీద ఉండడానికి నామనస్సు సుతరాం ఒప్పుకోవడములేదు. ఒకవేళ మావారితో చెపుతాను, చెప్పితే మామామగారికికూడా తెలుస్తుంది. పెద్ద గందరగోళము కాక తప్పదు. ఉమాపతికి గట్టిచిక్కు వస్తుంది. పోనీ అంతకంటె నాకెందుకని ఊరుకుందా మంటే మనస్సు ఒప్పుకోవడములేదు. ఉమాపతి వ్యాపారము మీదా, అతని మాటలమీదా అతనివర్తనమీదకూడా నాకు బొత్తుగా నమ్మకము లేదు. అతని విషయములో నాహృదయము చాలా విరుద్ధముగా ఉన్నది. ఏమయినా సరే దేవి లాగు నేను ఈ వ్యాపారమును నమ్మి ఉండలేను. నమ్మి ఉండడానికి మనస్కరించడము లేదు కూడా!

ఒక నెలరోజులు గడిచిపోయినవి. దేవికి ఒక మగశిశువు పుట్టినాడు. ఆమె ఆనందానికి అంతూ పొంతూ లేదు. కాని చూస్తూ ఉండగానే ఆ సంతోషప్రవాహము కన్నీటి వెల్లువలో కలిసిపోయినది. ఆపుట్టినబిడ్డ పురుడు వెళ్లకుండానే మాతృహృదయములో ఆరని చిచ్చు రగులుకొల్పి మరి, ఈలోకము విడిచిపెట్టి పోయినాడు. దేవి దుఃఖము మరిచెప్పలేను. తర్వాత నేను ఆమెముఖాన నవ్వు అన్నది ఎన్నడూ చూడలేదు.

కొన్నాళ్లు అయిపోయినది. ఉమాపతి తనభార్యను తీసుకొని వెళ్లడానికి వచ్చినాడు. మామామగారు చాలా కోపపడుతూ దేవి దగ్గరికి వచ్చి "నీవిప్పుడు అక్కడికి వెళ్లవద్దు. ఈపచ్చిబంటితో అక్కడ బండచాకిరీ చేస్తే ప్రాణానికే కూడా ముప్పు రావచ్చును." అన్నారు.

దేవి మెల్లిగా "ఎప్పటికైనా అక్కడికి వెళ్లవలసినదాననే. వెళ్లుతాను నేను నాన్నా?" అని అన్నది.

మా మామగారి మనస్సు చివుక్కుమన్నది. ఆయన తన కోపమును అణచుకొంటూ "సరే, వెళ్లు. ఇక మరి నిన్నెప్పుడూ ఇక్కడికి తీసుకొనిరానని జ్ఞాపకము ఉంచుకో. నేను బ్రతికి ఉండగా నీవు రావడానికికూడా వీలు లేదు." అని బయటికి వెళ్లిపోయినారు.

ఆయన వెళ్లిపోయిన కొంచెము సేపటికి ఉమాపతి బండితీసుకొనివచ్చి ఇంటిముందు నిలువబెట్టించినాడు. భార్యను పిలిచినాడు. బండి ఎక్కబోయేటప్పుడు దేవి నా దగ్గరికివచ్చి నా కాళ్లకు దండముపెట్టి "చూడు వదినా?

నేను వెళ్లుతున్నాను. నాన్నగారికి నామీద ఎంతో కోపమువచ్చినది. అది పోగొట్టి యథాప్రకారమునకు తెచ్చేభారము నీది." అని కన్నులు తుడుచుకొంటూ బండిఎక్కినది. బండి కదలినది.

మా మామగారు రోగులనందరినీ చూచి రెండుజాములకు ఇంటికివచ్చినారు. రాగానే సావిట్లోనుండే 'దేవీ' అని పిలచినారు.

ఆపిలుపు విని అత్తగారు లోపటినుంచి వచ్చి "ఆమె అప్పుడే అత్తవారింటికి వెళ్లిపోయినది." అని విచారముతో చెప్పినది.

మామగారు నిర్విణ్ణులైనారు. ఒక్క మాటైనా మాట్లాడలేదు. కొంచెముసేపు అటూ ఇటూ పచారుచేసి నెమ్మదిగా బయటి సావిడిలోకి వెళ్లి యోచిస్తూ కూర్చున్నారు. ఆయనతో మాట్లాడడానికే మా కెవరికీ సాహసము లేకపోయినది.

౨

ఒకసంవత్సరము గడచిపోయినది. మా మామగారు ఒకరోజున అకస్మాత్తుగా గుండె జబ్బువల్ల చనిపోయినారు. ఈసంవత్సరములో ఆయన ఎప్పుడూ దేవి సంగతి తలపెట్టనేలేదు. ఆమె కబురు తెలుసుకోవడమునకు యత్నించనేలేదు. ఆయనముందు దేవి పేరు ఎత్తడానికి ఇంట్లో ఎవరికీ సాహసమే లేకపోయినది. కన్నకడుపుకాబట్టి మా అత్తగారు మాత్రము ఒకసారి సాహసించి మామగారితో "అమ్మాయి కబురే తెలియడము లేదు. ఒకపారి ఎవరినైనా పంపి కొంచెము కనుక్కొంటే బాగుండును" అన్నది. మామగారు ఆమెను కసరి నాలుగు చీవాట్లు పెట్టినారు. దానితో ఆమెకూడా ఆయనముందు మరికూతురి పేరెత్తడానికి సాహసించలేదు. మామగారు ఎంతో నెమ్మదైనవారు. కడగొట్టుకూతురంటే ఆయన ప్రాణానికి ప్రాణము. ఆయన మనసు ఇంతగా విరిగిపోవడము నాకే ఆశ్చర్యము వేసినది. అత్తవారింటికి వెళ్లడము విషయములో తండ్రీకూతుళ్లకు జరిగిన సంభాషణము వినని వారికి ఆయన మనస్సు ఇంత మారిపోవడానికి కారణము ఏమిటో గ్రహించడము అశక్యము. ఆసంగతి తెలియకుంటే నేనుకూడా ఊహించనే లేకపోయి ఉందును.

తండ్రి చనిపోయినట్లు దేవికి తెలిసినది. ఆమె పదోనాడు పుట్టింటికి వచ్చినది. ఇదివరకులాగున ఆమెను ఎవరూ ప్రేమతో ఆదరించలేదు. దానికి కారణము మామగారు పోవడము. ఇంట్లో అందరూ విచారముతో ఉండడము. పాపము దేవికూడా అంటీ ముట్టకుండానే అందరికీ దూరదూరముగా మసలేది. ఆమెపైకి ఎంతగంభీరముగా ఉన్నా పితృదుఃఖమువల్ల లోలోపల కుమిలిపోతున్నదని ఆమె ముఖము చూచి కనిపెట్టవచ్చును. ఇతరులెవరూ తెలిసికోలేకపోయినా నేనుమాత్రము గ్రహించగలిగాను. అమె తనదుఃఖమును ఎంతో లోలోపల అణచుకొంటున్నది. దేవి తనతండ్రిని ఎంత ప్రేమించేదో, ఎంత భక్తితో

గౌరవించేదో నే నెరుగుదును. అందరికంటె చిన్నకూతు రంటేనే మామగారికి పంచప్రాణాలు. ఆయనపట్టుదలా కోపమూ కలిసి అంత ప్రేమను కూడా ఇట్టే మార్చివేయగలిగినవి. ఆయనపట్టుదల ఏమోకాని చనిపోయేటప్పుడు సైతము దేవిమాట తలపెట్టలేదు.

ఈమారు దేవినిచూస్తే నాకు కళ్లనీళ్ల పర్యంతము అయినది. ఆ అందమూ, ఆ చందమూ అంతా పోయినది, ఎన్నాళ్లనుంచో జబ్బుతో తీసుకొంటున్నమనిషిలాగు ఉన్నది. ఏమి వాలకముపడ్డది! బంగారమువంటి శరీరము వాడి పోయినది. కన్నులు లోతుకుపోయినవి. ఒంట నెత్తురే కనబడడములేదు. నులకతాడు లాగు ఉన్నది.

పితృకర్మ ఏలోపములేకుండా జరుగుతున్నది. 'ఏకాహ' మప్పుడు నేను దేవిని నా గదిలోకి పిలిచి, నాచేతిగాజులూ, మెడలోని హారమూ తీసి ఆమెకు పెట్టబోయినాను ఆమె నన్ను వారించి "ఎందుకివన్నీ వదినే?"అన్నది.

"చుట్టాలూ పక్కాలూ చాలామంది ఇంటినిండా ఉన్నారు. నీవు మొండిచేతులతో, మొండిమెడతో, తిరుగుతావా మరి?"

దేవిముఖము చిన్నబోయినది. మనసులో ఉన్న విచారమంతా ఒక్కనిట్టూర్పుతో పైకివిడిచి తలవంచుకొన్నది. ఆమె గుడ్లనీరు గుడ్లకుక్కుకుంటున్నదని తెలుస్తూనే ఉన్నది. ఆమె తడికళ్లతో దీనముగా నాకేసి చూచి "ఈ ఎరవుసొమ్ములతో లేనివైభవము నటించడము ఎందుకు? ఈ ఒక్కనాటితో వచ్చేదేమిటి పోయేదేమిటి వదినా?"

"వైభవము మాటకాదు ఇప్పుడు. నీవు ఈఇంటి ఆడుపడుచువు. నలుగురూ వచ్చినపుడు కొంచెముగుట్టు నిలబెట్టుకోవడము మంచిది. ఒకనాటి కర్మమేమిటి? నీకివి ఎప్పటికీ ఇచ్చివేస్తున్నాను. నీకు మేము పరాయివాళ్లమా ఏమిటే తల్లీ?"

దేవి మరి మాట్లాడలేదు. కనుగొలుకుల నుండి జారిన కన్నీటిబొట్లు ఆమె మనసును వెల్లడిచేసినవి.

శ్రాద్ధము ముగిసినది. ఒకరోజున మావారు ఉమాపతితో ఆమాటా ఈమాటా ప్రస్తావిస్తూ "అయితే నీ వ్యాపారము ఏవిధముగా నడుస్తున్నది?" అని మెల్లగా అడిగినారు.

ముఖము చిన్నపుచ్చుకొని చెప్పలేక చెప్పలేక ఉమాపతి "ఏమంత సరిగా-సరిగా లేదు. ధరలు పడిపోయినవి. రాబడిసున్న. చాలా నష్టమువచ్చినది" అన్నాడు.

మావారు నవ్వుతూ "వ్యాపారములోని సులువుబలువులు నీకు తెలియవు వ్యాపారము చేయడము నీవల్లగాదు. ఏదో ఉద్యోగమో సద్యోగమో చూచుకొని కాలక్షేపము చేయడము మంచిది. లేకపోతే కొన్నాళ్లకు జైలు కూడా చూడవలసివస్తుంది." అన్నారు.

ఉమాపతి మాట్లాడలేదు. మావారు ఊరుకోక "మీ నాన్నగారు ఏమంటారు?" అని అడిగినారు.

"ఆయనకూ నాకూ మాటలు లేక చాలారోజు లయినది."

"ఎందు కంతవరకు వచ్చినది?"

"కారణమేమీ లేదు. నెల నెలకూ వందో, రెండువందలో పట్టుకొనివెళ్లి ఆయన దోసిటిలో పోస్తే నా అంతమంచివాడు ఉండక పోవును. ఆయనకు మేము ఇంట్లోఉండడమే గిట్టదు. అందువల్లనే కొన్నాళ్లపాటు మీ చెల్లెలిని ఇక్కడ అట్టేపెట్టవలె ననుకొంటు న్నాను. నేను ఏదో హోటల్లో భోజనము పెడతాను. కొన్నాళ్లు పోతే సంగతి సంద ర్భాలు చూచుకొని ఒకయిల్లు అద్దెకు తీసు కొని వేరేకాపురము పెడతాను."

"ఆహోటల్లో ఈ హోటల్లో తిని నీవు మాత్రము ఒళ్లు చెడగొట్టుకోవడ మెందుకు? అక్కడ నీకు ఇబ్బందిగా ఉంటే నీవుకూడా ఇక్కడనే ఉండవచ్చు. నా చెల్లితోపాటు నీకు కూడా ఇంతభోజనము పెట్టలేనిదుః స్థితి ఇంకా నాకు రాలేదు. నీవు వ్యాపారము చేయలేవు. ఏదైనా ఉద్యోగము చూడవచ్చును. నీకు ఏలాగు అనుకూలమైతే ఆలాగే చేయవచ్చు. అనవసరముగా మీ నాన్నగారితో తగాదా పెట్టుకోవడ మెందుకు? మనస్పర్థలు పెరగ నీయకూడదు."

అప్పటినుంచి ఉమాపతి అత్తవారింటనే భార్యతోపాటు ఉన్నాడు. రోజూ మధ్యా హ్నము భోజనముచేసి బయలుదేరేవాడు. తిరిగి రాత్రి పన్నెండూ ఒంటిగంటకు ఇల్లు చేరేవాడు. 'అదే'మని ఎవరైనా అడిగితే ఏదో సాకుచెప్పేవాడు. ఇంటి అందరికీ అత నంటే అసహ్యము పుట్టినది.

అర్ధరాత్రమువరకు కాచుకొని ఉండి అత నికి ఎవరు తలుపు తీస్తారు? ఇంట్లో నౌకరీ వాళ్లందరూ విసుగుకొనేవారు. వంటబ్రాహ్మ ణుడు ఈయనగారు వచ్చినదాకా కనుపెట్టు కొని ఉండేవాడుకాడు. అందరి భోజనాలు కావడముతోనే వెళ్లిపోయేవాడు. వండిన అన్నమూ కూరలూ తనగదిలో ఉంచి, దేవి మాత్రము మేడవీధి వరాండాలో కనుపెట్టు కొని ఉండి, వీధివైపు రెప్పవాల్చక చూస్తూ అర్ధరాత్రమువరకూ మేలుకొని ఉండేది. కాలిచప్పుడు కాగానే మెల్లగా మేడదిగివెళ్లి వీధితలుపు తీసి అతనిని గదిలోకి తీసుకొని వచ్చి భోజనముపెట్టి అప్పుడు కొం చెము కునుకు తీసేది. ఇంతకుముందు ఒకటి రెండు సారులు ఈసంగతి తెలిసి మావాడు కూకలేశారు. అందువల్ల ఇంతజాగ్రత్త అవస రమయినది. ఈవరుసచూచి ఉమాపతివిషయ ములో అందరికీ అనుమానము పుట్టినది. అతని ప్రవర్తనను గూర్చికూడా. కాని ఈ ప్రపంచ ములో ఏసందేహమూ లేనిది అతని భార్య ఒక్కతే. ఈవిషయమై మేమెవరమైనా ఏదైనా చెప్పితే నమ్మేదికాదు. కాని ఊరికే ఏడ్చేది.

ఉమాపతి అప్పుడప్పుడు భార్యద్వారా అత్తగారిదగ్గరనుంచో, లేకపోతే మావారి దగ్గరనుంచో ఏభై, అరవైరూపాయలు అడిగి తీసుకోవడము సాగించాడు. ఎందుకని అడిగితే

"నాపర్సు ఎక్కడనో పోయిం"దని ఒకసారి, "తప్పకుండా ఈవేళ ఇస్తానని ఒకతనికి వాగ్దానము చేసినాను. ఇవ్వకపోతే మర్యాదపోతుంది" అని మరొకసారి, అత్యవసరమైన పని ఉన్నది. ఇప్పుడిస్తే మళ్లీ నాలుగురోజులలో తిరిగి ఇచ్చివేస్తాను"అని వేరొకసారి ఇలాగే ఎన్నో చెప్పేవాడు. వ్యవహారము ముదిరినది. డబ్బుకోసము భార్యను వేపుకొనితినడము ప్రారంభించినాడు. ఈసంగతి అందరికీ తెలిసినది. ఒకనాడు మావారు "ఇక నేను డబ్బు ఇవ్వను"అని నిస్సంకోచముగా చెప్పివేసినారు. ఇవ్వవద్దని తల్లితో కూడా గట్టిగా చెప్పినారు.

కొన్నాళ్లు జరిగిపోయినది. ఒకనాడు మా రెండోవదినగారి మగడువచ్చినాడు. ఆ రోజుపగలు ఆయన జేబులోవి రెండు పది రూపాయలనోట్లు పోయినవి. ఎంతో గందరగోళము జరిగినది. ఇంట్లో అందరూ ఎంతో మనసు నొచ్చుకొన్నారు. మాట్లాడకుండా మావారు ఆడబ్బు బావగారికి ఇచ్చివేయబోయినారు. కాని ఆయన తీసుకొననేలేదు. పైగా చాలా అభిమానపడినాడు. ఆయన వెళ్లిపోయినతర్వాత మావారు ఇంట్లో నౌకర్ల మీాద చాలా కోపపడినారు మొఱ్ఱో మేమేమిా ఎరగము, అని వాళ్లు ఒకటేగోల. అసలు సంగతి నౌకర్లు ఎవరూ మేడ ఎక్కనే ఎక్కరు.

అసలు సంజవేళ నాగదిలో నేను తల దువ్వుకొంటున్నాను. మెల్లగా దేవి అక్కడికి వచ్చినది. ఏవో ఆసంగతీ, ఈసంగతీ మాట్లాడుకొన్నతరువాత హఠాత్తుగా దేవి ఏడుస్తూ "వదినా? చెప్పడానికి నాకు నోరు రావడములేదు. ఆడబ్బునేనే తీసుకొన్నాను. ఎంతో అవసరమని మిాఅన్నయ్య అడిగినారు. ఏమిచేయను? నేను చస్తే బాగుండును వదినా? నలుగురూవింటే ఏమంటారు?" అని నొసట కొట్టుకుంటూ చెప్పినది.

నేను నిశ్చేష్టురాలనై పోయినాను. దేవి ఇంత అధోగతిపాలవుతుందని నేను ఎన్నడూ అనుకోలేదు. పెనిమిటి సుఖము కోసము తాను పదిమందినోళ్లలో పడడానికికూడా వెనుతీయలేదు. దేవిని నేను మెచ్చుకొననా? నిందించనా? ఆమెముఖము చూస్తే నాగుండె కొట్టుకొంటున్నది. దుఃఖముతో పశ్చాత్తాపముతో ఆమె హృదయము తగులబడి పోతున్నదని తెలుస్తూనేఉన్నది. చేసినపనిని గూర్చి ఆమెకు ధైర్యములేకపోలేదు. లేకుంటే తప్పు ఒప్పుకోవడమునకు సాహసించగలదా?

అనుతాప పరిపక్వమై ఆమెహృదయము పండిన గోరింటకాయవలె ఉన్నది. ఎంత తేలికమాట దానికి తాకినా చెక్కలైపోతుంది. అదిగ్రహించి నేను గబగబ గదితలుపు గడియపెట్టి ఆమెను ఓదార్చడమునకు ఆరంభించినాను. ఎవరికైనా ఈసంగతి తెలుస్తుందేమోనని నేను ఇంతశ్రద్ధ వహించినాను. కాని నాశ్రద్ధ పనికిరాలేదు. దేవి తననేరము తానే ఒప్పుకొన్నసంగతి అందరికీ తెలిసిపోయినదని రెణ్ణాళ్లతర్వాత నాకు తెలిసినది. కాని నౌకర్ల

నందరినీ బెదిరించి ఎవరినీ నోరెత్తకుండా చేసింది అత్తగారు. ఇది వెల్లడిఅవుతేనేగాని తమ నిజాయితీ యజమానుడికి తెలియదని వాళ్ల యేడుపు. అందరూ దేవిని సంశయదృష్టులతో అవమానపరుస్తున్నారని తెలిసి నేను చాలా అసహ్యపడినాను. సంశయించడమునకు మరి అభ్యంతరము ఏముంటుంది?

ఆరునెలలు గడచిపోయినవి. రేపు మా అబ్బాయికి అన్నప్రాశనముహూర్త మనగా ఆరోజు సాయంకాలము మావారు నాగదిలోకివచ్చి రెండువందల రూపాయలు నాచేతికిచ్చి "నీదగ్గిరఉంచు. రేపు తీసుకొంటాను" అన్నారు.

ఆరూపాయలు తీసుకొని నేను నవ్వుతూ "ఇవి ఇక మీకు రావుమరి! వీటితో అబ్బాయి మెళ్లోకి గొలుసు చేయిస్తాను" అన్నాను.

"ఏమీ తోచకపోతే సరి! అవి ఖర్చుపెట్టడమునకు వీలులేదు. రేపు చాలాఅవసరము ఉన్నది." అని మావారు వెళ్లిపోయినారు.

దేవి అప్పుడు అక్కడనే ఉన్నది. నేను పెట్టెతీసి నోట్లు అందులోపెట్టి తాళమువేసి తాళపుచెవులగుత్తి పరుపుతలగడక్రిందపెట్టి కిందికి వెళ్లిపోయినాను. ప్రొద్దుట మావారు నన్ను ఆడబ్బు అడుగలేదు. నాకుకూడా ఆసంగతి జ్ఞాపకము రాలేదు.

కుఱ్ఱవాడి అన్నప్రాశనము జరిగినది. నాలుగురోజులైనతర్వాత మావారు వచ్చి "ఏది ? ఆవేళ నీకిచ్చినడబ్బు ?" అని అడిగినారు. నేను పెట్టెతీసి చూచినాను నోట్లు కనబడలేదు. పెట్టెలో వస్తువులన్నీ తీసి కింద పారవేశాను. నాకు వణుకుపుట్టింది. నా వెదకడము వరస చూచి మావారు చిరాకుపడడము మొదలుపెట్టారు. "ఆ రూపాయలు కనుపించడములేదు" అని నేను నెమ్మదిగా అన్నాను. మావారు నామాట నమ్మలేదు. నమ్మక "ఉన్నచోటువదలి అక్కడా ఇక్కడా వెదికితే ఎక్కడఉంటవి? ఆడబ్బుతో చాలా అవసరము ఉన్నదీ, గొలుసూగిలుసూ చేయించడమునకు ఇప్పుడు వీలులేదు అని నేను మొదటనే నీతో చెప్పినాను. అందుకోసము—"

ఈ విధముగా ఎన్నో నిష్ఠురోక్తులు అన్నారు. నాకు ఎంతోకోపము వచ్చినది. 'నేను తీసుకొనలేదో దేవుడా' అని ఎంత చెప్పినా ఆయన నమ్మకము లేదు. ఏమి చేయను! ఉక్రోషము వచ్చి ఏడ్వ మొదలుపెట్టాను. మా అత్తగారు గబగబవచ్చి "ఎందుకు ఏడుస్తావుతల్లీ! గదిలోకి ఎవరు వచ్చినారో, ఎక్కడపెట్టినావో కొంచెము యోచించిచూడు. పెట్టిలో పెట్టినవి ఏమవుతవి?" అన్నది. ఆరూపాయలు దాచుకొని పోయినవని నేను అబద్ధమాడుతున్నాననే అందరి అభిప్రాయము.

మా అత్తగారి మాటలతో హఠాత్తుగా నాకు దేవిమాట జ్ఞాపకము వచ్చినది. ఎవ్వరు లేకుండా చూచి ఆమెను నాగదిలోకి తీసుకొనివెళ్లి "వేళాకోళానికి నీవేమైనా తీసి దాచినావా దేవీ" అని అడిగినాను.

ఆమె రెప్పవేయకుండా నాకేసి ఒక మారు చూచినది. నేను కొంచెము జంకి పోయినాను. దేవికి ఎంత అభిమానమో నే నెరుగుదును. వెంటనే ఆమె తలవంచుకొని "అవును. నీపెట్టెతీసి నేనే ఆరూపాయలు తీసుకొన్నాను. మీ అన్నయ్య ఒక మార్వాడీకి అప్పు ఉన్నారట. వాడు చంపుకొని తింటున్నాడని ఆయన అదేపనిగా బాధపడితే నేనే ఆడబ్బుతీసి ఆయనకిచ్చినాను" అన్నది.

నేను ఒక నిట్టూర్పువిడిచి "ఈమాట మీ అమ్మదగ్గర ఒప్పుకొంటావా?" అని గంభీరముగా అడిగినాను.

"అమ్మదగ్గర నేకాదు. అందరిదగ్గర ఒప్పుకొంటాను. కాని ఆ మార్వాడీమాట మాత్రము చెప్పను." ఈమాట అని గబగబ మేడదిగివెళ్లి వాళ్ల అమ్మతో "వదినెపెట్టెతీసి ఆరూపాయలు నేనేతీసి మీఅల్లుడికి ఇచ్చాను. ఈమాట నీవు అన్నయ్యతోకూడా చెప్పవచ్చును." అని చెప్పినది.

మాఅత్తగారువెళ్లి కొడుకుతో చెప్పినది. ఆయన నవ్వుతూ "దేవికి శుశ్రూషచేసి ఆమెదగ్గర పతిభక్తి నేర్చుకొమ్మని నీకోడలితో చెప్పు" అని ఆయన అన్నారు. ఏమి అననీ నామనసు కుదుటబడ్డది.

ఈసంగతి ఎవరికీ తెలియకుండా కప్పిపుచ్చవలెనని మావారునవ్వి ఊరుకొన్నారు. కాని మా అత్తగారు ఊరుకోలేక పోయినది. అల్లుణ్ణి, కూతురిని తిట్టిపోసినది. చాలా గందరగోళము జరిగినది.

ఆ మరునాడే మధ్యాహ్నము రెండు జాములవేళ ఉమాపతి తనపెళ్లాన్ని తీసికొని ఇంట్లోనుంచి వెళ్లిపోయినాడు. అత్తగారు కూతురుమొగాన ఇంతకుంకుమపు బొట్టు కూడా పెట్టలేదు. అసలు మాట్లాడనేలేదు. ఈ మట్టమధ్యాహ్నము ఎక్కడికే ప్రయాణమని ఎవ్వరూ అడగనైనా అడుగలేదు.

సాయంకాలము కచ్చేరీనుంచి వచ్చి మావారు ఈ సంగతి విన్నారు. వాళ్లఊరు కబురుచేసినారు. వాళ్లు అక్కడనే ఉన్నట్లు కబురు తెలిసినది.

3

రమారమి ఒక సంవత్సరముపైగా జరిగిపోయినది. ఈలోపల ఎన్నోమార్పులు తటస్థించినవి. నాకర్మము కాలిపోయినది. మావారు అకస్మాత్తుగా చనిపోయినారు. నా మనసంతా పాడయిపోయినది. చాలా జబ్బుచేసినది. పిల్లలకుకూడా శరీరములో స్వస్థత లేదు. మానాన్నగారువచ్చి నన్నూ పిల్లలనూ తీసుకొని విశాఖపట్టణము వచ్చినారు. ఆ బ్రహ్మాండమైన జబ్బులో మంచముమీద ఉండగానే నాకు దేవి మరణవార్త తెలిసినది. చచ్చిపోవడమునకు ముందు దేవి నాకొక జాబు వ్రాసినది. ఆజాబు ఇట్లున్నది.

పెద్దవదినే!

ఈ ఉత్తరము నీకు అందేలోపలనే నేను మరి ఈలోకములో ఉండను. ఉండలేను. నాకు ఏలోకము వ్రాసిపెట్టి ఉన్నదో, ఏ చీకటిలో

కలసిపోతానో ఇప్పుడు ఊహించలేను. ఈలోకము విడిచిపెట్టడమునకు ముందు నీతో చెప్పకొనవలసినమాటలు ఈజాబులో వ్రాస్తున్నాను. నీవు నన్ను కన్నతల్లిలాగు కడుపులో పెట్టుకొని ఆదరించినావు. తోబుట్టువువలె చేదోడు వాదోడువైనావు. ప్రియసఖివలె నీహృదయములో చోటిచ్చినావు. దేవతవలె ప్రేమించినావు. నేనెప్పుడూ నీదగ్గర ఏవిషయమునూ దాచలేదు. ఇప్పుడూదాచను. కోరినా అంతట నేనే ఆత్మహత్య చేసుకొంటాను. ఇంతకన్నా నాకు మరొకమార్గము లేదు. నేను బ్రతికి ఉండడము వట్టివిడంబనమని నాకు తోస్తున్నది ఈ మాటలనుబట్టి నీవు నా మనస్సు పాడయిపోయినదని, వెఱ్ఱిఎత్తినదని అనుకొనవచ్చు. కాని కొంచెము నామాటలన్నీవిని యోచిస్తే నా మనస్సూ మెదడూ సరియైనస్థితిలోనే ఉన్నవని, నేను పిచ్చిదాననై పోలేదని నీకే తెలుస్తుంది. నీవుమాత్రము నన్ను క్షమించు. ఆత్మహత్య మహాపాపమని నీవు అనవచ్చును. కాని ఇప్పుడు పాపపుణ్యవిచారణ చేయడమువల్ల కాలహరణముతప్ప నాకు మరొకప్రయోజనము కనబడడములేదు.

ఆవిచారతో నాకు అవసరమేలేదు. నేను చచ్చిపోయినతర్వాత దేవుడు నాకు స్వర్గమే వ్రాసిపెట్టాడో, నరకమే వ్రాసిపెట్టాడో, ఏదైనాసరే నాకర్మఫలమని నేను దానిని అనుభవిస్తాను. నేను బ్రతికిఉండగా దేవుడు నా అదృష్టముతో ఎంతనిష్ఠురముగా ఆటలాడుకొన్నాడో నీవెరుగుదువు. ఇక చచ్చినతరువాత విచారము నాకెందుకుచెప్పు? సరే. నా అదృష్టము చివరకు ఎట్లు పరిణమించినదో మాత్రము నీకిప్పుడు తెలుపవలెనని నా సంకల్పము.

మీఅన్నయ్య ఏదో ఆఫీసులో నౌకరీ చేస్తున్నాడు. ఆ ఆఫీసుకు సంబంధించినడబ్బాదస్కాము యావత్తూ మీ అన్నయ్యచేతిలోనే ఉంటుంది. అందులో మూడువేలరూపాయలవరకు రహస్యముగా ఆయన ఖర్చుపెట్టుకొన్నాడు. ఇది ఎన్నాళ్లనుంచి జరుగుతున్నదో ఏమో నాపాపములాగు నేడు బయటబడ్డది. ఆయనపేర వారంటు తిరుగుతున్నది. ఆయన దొరకకుండా ఎక్కడనో దాగుకొన్నాడు. ఎంతోరహస్యముగా నిన్నరాత్రి ఇంటికివచ్చి నాకు దర్శనమిచ్చినారు. నాచేతులు పుచ్చుకొని ఏడుస్తూ మొదటినుంచి జరుగుతూ వస్తున్న తనపాపకథ ఆమూలాగ్రముగా నాతో ఏకరువుపెట్టినారు. ఆయన పందెపు గుఱ్ఱపుపరుగుతో ఒక స్త్రీవలలోపడి ఉన్న సమస్తమూ దానిపాదాలకు సమర్పించుకొన్నారు. వదినే! ఈలోకములో ఇంత మోసము ఉన్నదని నాకు తెలియదు. నేను నాహృదయమందిరములో నిలుపుకొన్న దేవతామూర్తిని పాడుచేసిన దెవరు? నేను నాభర్త కోసము ఎంత అవమానము పాలయినానో, ఎన్నిసహించినానో నీవెరుగుదువు. నాభర్త కన్న దేవుడులేడని మనసులో ఎంత సంతృప్తిని పొందేదానను? ఎంత గర్వపడేదానను?

నీవు ఎన్నోసారులు ఎన్నో నాకు చెప్పినావు. కాని నేను నమ్మలేదు. అసలు విననే వినలేదు. నాభర్తమీద నాకున్న విశ్వాసము నన్ను, అప్పుడు సత్యమును గ్రహించకుండా చేసినది. ఆయన మరొక ఆడుదానికి తనసర్వమూ అమ్ముకుంటాడనే మాటనే నేను నమ్మలేదు. నీకు జ్ఞాపకము ఉన్నదో లేదో ఒకనాడు మనము భారతములోని 'సత్యాద్రౌపదీసంవాదము' చదివినాము. అందులో 'భర్తపై భార్యకు అనుమానము పుట్టగూడదు. పుట్టితే మరి ఆసంసారము దుఃఖాకరము. భర్తవిషయమై అవిశ్వాసమూ, అనుమానమూ కలిగిన ఆడుది తన సర్వనాశనమును తానే చేసుకొన్నదగును' అనుమాటలు నాహృదయమునకు పట్టిపోయినవి. పతియెడ అవిశ్వాసము కలిగి సర్వనాశనమైన వారికథలు ఎన్నో చదివినాము. అందువల్ల ఎవరు ఎన్నిచెప్పినా నేను నాభర్తను ఎన్నడూ ఏవిషయములోనూ సందేహించలేదు. ఆ సంశయచ్ఛాయను కూడా నాహృదయానికి అంటకుండా జాగ్రత్త పడినాను. నేను పరిపూర్ణవిశ్వాసముతో ఎవరిని ఆరాధిస్తున్నానో వారు ఇంత నీచకార్యమునకు ఒడిగట్టుతారన్నమాట నవ్వులాటకు కూడా అనుకోలేకపోయినాను. వదినే! ఈపాడు లోకము ఎంతనిష్ఠురము! కాని పురుషజాతి గర్వమునూ, కృతఘ్నతనూ, నేను ఇప్పటికి కూడా ఊహించలేకున్నాను. ఇదంతా నావిధి అనుకొంటున్నాను. నాభర్తకోసము వృద్ధుడైన నాతండ్రిమనసు ఎంతనొప్పించినానో నీవెరుగుదువు. అదే అతని మరణమునకు కారణము. నేను అందరినిందలకూ, అసహ్యతకూ పాలయినాను. అంతవరకెందుకు? ఎన్నోసారులు నన్ను నేనే అసహ్యించుకొనేదానను. ఏమయితేనేమి? సర్వమూ నిష్ఫలమై పోయినది. నిష్ఫలమైనదని ఇప్పటికీ అనుకొనలేకుండా ఉన్నాను. మావారు ఏడుస్తూ నారెండుచేతులు పట్టుకొని "దేవీ! నీవే నన్ను బ్రతికించవలె. జైలుకువెళ్లితే చావుతప్పదు. డబ్బుఇస్తే పోలీసులు మరి కేసుపెట్టరు." అని అన్నారు. ఆయన కన్నీటితో నా మానాభిమానాలు తుడుచుకొనిపోయినవి. అవమానమన్నమాటే మరిచిపోయి నేను ఈవేళప్రొద్దుటనే మాఅమ్మదగ్గరికివెళ్లి సంగతి అంతా చెప్పివేసినాను. చిన్నన్నయ్యదగ్గరికివెళ్లి కాళ్లూ కడుపూపట్టుకొని బ్రతిమాలినాను. కాని వారు నావైపేచూడలేదు. ఒక నిట్టూర్పుకూడా వదలలేదు. పైగా మా చిన్నన్నయ్య సంగతి అంతా విని నిర్దాక్షిణ్యముగా "వాడు జైలుకు వెళ్లడమే మంచిది" అన్నాడు. ఇక మాఅక్కయ్యల సంగతి చెప్పవలసినదేమున్నది? అందరూ వేళాకోళాలూ ఎద్దేవాలూ మొదలుపెట్టారు. అక్కడ మరి నేను ఉండలేకపోయినాను. వెంటనే వచ్చినదారి పట్టినాను. ఈసమయమున నాతండ్రిలేడు. పెద్దన్నయ్యలేడు. నీవుకూడా పుట్టెడుజబ్బుతో దూరాన ఉన్నావు. నీవు ఉంటేమాత్రము ఏదోదారి చూపెట్టేదానవే. చివరకు మీతండ్రితోచెప్పి అయినా డబ్బుతీసుకొనివచ్చి నన్ను గట్టెక్కిం

చేదానవు. మీతండ్రి ఘరానామనిషి. ఉదారుడు. నేను ఆయనకు కూతురువంటిదాననే. మీరుంటే ఏలాగైనా కాపాడేవారు.

కాని మరి నాకు ఆ ఆశ లేదు. మీనాన్నగారుకూడా నీదగ్గరనే ఉండిపోయినారు. నీవు ఖాయిలామనిషివి. పుట్టెడుదుఃఖములో తల మునిగి ఉన్నావు. ఇంతకూ నేను నిర్భాగ్యురాలను. నాకు ఈజగత్తు సర్వమూ శూన్యము. మా ఆడుపడుచు లందరూ నన్ను చూచి ముసిముసినవ్వులు నవ్వుతున్నారు. మామామగారి మాట ఇక చెప్పవలసిన పనిలేదు. అసలే ఎడమొగము పెడమొగము. ఇప్పుడు మరింత. నేను ఏమిచెయ్యను వదినే?

ఇప్పుడు రాత్రి ఒంటిగంట కావస్తున్నది. ప్రపంచమంతా హాయిగా నిద్రపోతున్నది. ఒక్క నేనుమాత్రమే నాభవిష్యత్తును ఆలోచించుకొంటూ జాగరము చేస్తున్నాను. నాభర్త వచ్చేవేళ అయినది. డబ్బు ఎక్కడను దొరకలేదని ఆయనతో చెప్పడము ఏలాగు? ఇప్పటి ఆయన వాలకమూ, ఆయన దుఃఖమూ చూస్తే నీవుకూడా ఏడువకుండా ఉండలేవని చెప్పగలను. చిక్కులోనుండి బయటపడడమునకే అను, పశ్చాత్తాపమే అను, ఏమైనాసరే ఆయనస్థితిచూచి నేను భరించలేక పోతున్నాను. ఆయనకంటికి కడవెడుగా ఏడుస్తూ "దేవీ! నాకు తల్లిలేదు. ఉన్నతండ్రికూడా లేనివాడితో సమానము. నీవుతప్ప నాకు ప్రపంచములో నా అన్నవారు ఎవరూలేరు. ఏరీతిగానైనా నన్ను బ్రతికించు." అని అంటూ ఉంటే నాహృదయము చెక్కలైపోతుంది. "డబ్బు కావలసివచ్చినపుడు ఆయనకు నీవు కావలసివస్తావు. అతనంత స్వార్థపరుడూ, కృతఘ్నుడూ మరి ఉండబోడు" అని నీవనవచ్చును. వదినే! నాబ్రతుకులో స్వార్థమనేది నశించిపోయినది. సర్వమూ ఆయనకోసమే. తన ప్రయోజనముకొరకు కావలసినంతమట్టుకు నన్ను వినియోగించుకొనని య్యాడముకన్న నాకు కావలసినదేమిటి? స్వార్థమనీ, అభిమానమనీ, నేను ఇప్పుడు సమయము దొరికినదిగదా అని ఆయనను ఉపేక్షించి ప్రాయశ్చిత్తముచేయనా? అంత కాఠిన్యము స్త్రీజాతిలో లేదనే నానమ్మకము. ఇప్పుడు మా అత్తగారు బ్రతికిఉంటే తన కొడుకును కష్టసముద్రములో విడిచిపెట్టి ఆమెచూస్తూ ఉండగలదా చెప్పు! ఎవడైనా కూనీచేస్తే ప్రపంచమంతా అతనిని నిష్ఠురముగా చూచి అసహ్యించుకొనవచ్చును. కాని తల్లిమాత్రము తన సంతానమును రక్షించుమని భగవంతునికి కోటి మొక్కులు మొక్కుకొంటుందనే నానమ్మకము. నేనుకూడా అట్టితల్లుల సంతానమును. నిజము చెప్పుతున్నాను ఆయనమీద నాకిప్పటికీ కోపముగాని, దుఃఖముగాని, కసిగాని లేదు. ఆయన వ్యాపారమునుగురించి నేను విచారించలేదు. ఇప్పుడుకూడా విచారించను. నాలో ఏలోపములేకుండాఉంటే అంతేనాకు సంతృప్తి. ఇప్పుడు నామనస్సులో ఏమున్నదో నేను వ్రాయలేకపోతున్నాను. ప్రపంచమంతా ఒకపక్షము. నేనొక్కతెనే ఒకపక్షము. ఇప్పటి

కైనా నాకున్న ఆధారము, ప్రపంచమున కంతటికీ అపరాధి అయిన నాభర్తగారు. లోకములోకమంతా ఆయనను తిట్టి దుమ్మూ ధూళి ఎత్తిపోసి నాశనము చేయడమునకు తన నోరు తెఱచుకొని ఉన్నది. నాకున్న కాస్తపసరు కూడా ఇప్పుడు వదలివేయడము నాతరమా! కాని ఆయనను రక్షించేసామర్థ్యము నాకు లేదు. రేపు నాదగ్గరనుంచి నాభర్తను పోలీసులు పట్టితీసుకొనిపోతారు. నేను కన్నులు తెరచుకొనిచూస్తూ నిలబడి ఉండవలసినదేనా? ఉండలేను వదినే! ఏది నా ముఖ్యకర్తవ్యమో దానిని నిర్వహించేశక్తి నాకు భగవంతుడియ్యలేదు. నా అశక్తిని నాభర్త గ్రహించడమునకు ముందే అసలు నేను ఈలోకమును విడిచిపెట్టి వెళ్లిపోతాను. ప్రాణములతో ఉండి నేను ఆయనను విపద్దేవతకు ఒప్పగించలేను. దౌర్బల్యమనీ, నైచ్యమనీ, తెలివితక్కువ అనీ నన్ను గురించి లోకులు ఏమైనా అనుకొననీ! తిట్టనీ, దీవించనీ, నేనుమాత్రము దానికి భయపడను, అసహ్యపడను. కాని ఒక్కదానికి భయపడుతున్నాను. ఈనామరణవార్త విని నీవుగుండె చెక్కలయ్యేటట్లు ఏడుస్తావు. నీకుకలిగే బాధ తలచుకొంటే నాకు ఇప్పుడు ఏడుపు వస్తున్నది. నీవు నామీద కోపగించకుండా ఉంటే నా కదే పదివేలు.

వదినే! ఈవేళ తిథి ఏమిటో తెలుసునా? ఫాల్గుణశుద్ధసప్తమి. సరిగా ఈరోజుననే నా భర్తను నేను మొట్టమొదట చేరుకున్నాను. అది అంతా ఇప్పుడు నాకు జ్ఞాపకము వస్తున్నది. అప్పటివలెనే ఇప్పుడు వెన్నెలకిటికీలోనుంచి చంద్రుడు నావైపు చూచి నవ్వుతున్నాడు. వెన్నెల నామీద పడుతున్నది. ఆనాటిపాట మారంగక్కయ్యపాడినది. ఇప్పుడు జ్ఞాపకము వస్తున్నది.

ఏటికే నాకింక జడుపు-ఒక్క
నాటికిని రాబోదె విడుపు-
నాహృదయనాథుండు, నాజంట విడకున్న
నాకీప్రపంచమ్మె నందనోద్యానమ్ము. ఏటి.
కాలమేఘాలు లోకాల కనుమూయనీ
మాయదేనాచందమామ చిరునవ్వు. ఏటి.
కటికచీకటి కాటుకలపూత పూయనీ
నన్నుబాదవునె పంచు వెన్నెలల వెలుగు. ఏటి.
నిదురలో మరపులో నెనరు జాగరములో
వదలిపోవనిశరద్వైభవ మ్మిదెయుండ ఏటి.

ఆహా అది ఒకరోజు. మరల ఇది ఒకరోజు. దానికి దీనికి ఎంతోవ్యవధానము! ఆ నాటి వెన్నెలలలో నా హృదయేశ్వరుని పాదాల దగ్గర ఆశ్రయము పొందినాను. ఈనాటి వెన్నెలలలో మరల ఆ పాదాలదగ్గరనే ఆశ్రయము కోరుతూ వెళ్లిపోతాను. ఇప్పుడే పదినిముసాలలో ఆయన వస్తారు. వదినే! సెలవు తీసుకొంటాను. నీకు వేనవేలు నమస్కారాలు. నన్ను క్షమించుసుమా! ఆయన వచ్చేవేళ అయినది. ఆయనముఖము చూస్తే నాకు మరల బ్రతుకుమీద ఆశపుట్టవచ్చును. రక్షించ

లేని అశక్తు రాలను. ఇక ఆలస్యము చేయను. ఆయనను ఉద్ధరించేభారము ఆయన దేవుని మీదనే పడవేశాను. ఈశ్వరుడు నన్ను పూర్తిగా పరీక్షచేశాడు. నా హృదయము ఎరుగును. మొన్న పత్రిక చదువుతుండగా చని పోవడమునకు దారి తెలిసినది. అదిగో! గది మూల ఉన్న కిరసనాయిలుడబ్బా మృత్యు దేవతవలె నాకేసి చూస్తున్నది. జనన మరణ ములకూ, సుఖదుఃఖములకూ అతీతమైన జ్యోతిర్లోకములో, నిష్కళంకమూర్తిని నా దేవతను మరల పొందుతాను. నన్ను ఆశీర్వ దించు వదినే! సెలవు.

అభాగ్యరాలు నీ 'దేవి'

ఇక నేను వ్రాయవలసినదిలేదు. ఈ ఉత్త రము తండ్రిగారి కిచ్చినాను. ఆయన భాస్కర రామాయణములో సీత అగ్నిప్రవేశఘట్టము చదువుతున్నారు. నేను ఆయనను పిలువ బోయేటప్పుడు చదువుతున్న పద్యముతో నా దేవి మరణయాతన అనండి, లేకుంటే ఆనంద మనండి నా మనోనేత్రమునకు గోచరించినది.

" పవడపు రాశిలోని నవ
భర్మశలాకయుఁ బోలె, చారుప
ల్లవముల కుప్పలో నిడిన
లాలితచంపకదామ మట్లు, ర
క్తవనజరాజి హంసియనఁ
గా నరుణాభ్రములోన నున్న యా
నవశశిరేఖవోలె దహ
నస్థితయయ్యె విదేహకన్యదాన్."

గ్రంథము మూసిపెట్టి మానాన్నగారు ఆ ఉత్తరము చదువ మొదలుపెట్టారు. నా అవస్థ వ్రాయలేను. దేవి భౌతికశరీరమును ఆకలిగొన్న అగ్నిహోత్రుడు సంతోషముగా తన జిహ్వాసప్తకమును చాచి ఆరగించి ఉం టాడు. కాని నా దేవి నా హృదయములోనే ఉన్నది. హా! దేవీ! లోకము ఏమనుకొననీ, నీవు నాకు మాత్రము అపరసీతా దేవివి.

మానాన్నగారు ఉమాపతివిషయములో ఏమి ఏర్పాటుచేసినారో నే నడుగలేదు. బహు శా ఆడబ్బు ఇవ్వవచ్చును. అతనిని విడిపింప వచ్చును. కాని నాముద్దు మరదలు కనబడదు గదా!

ఉమాపతి ఎక్కడ ఉన్నాడో తెలియదు. తెలిసికొనవలెనన్న తలంపుకూడాలేదు. ఏమి లాభము!!